కవితా కౌముది

# నా అధ్యాపకురాలు

బాలాజీ పంజా



అక్షరాలు మాత్రమే నేర్చుకున్న విద్యార్థులకి
పుస్తకాలు వదిలేసి వెళ్ళిపోయిన అధ్యాపకురాలి కోసం
ఈ తరగతి గది ఎదురుచూస్తూనే ఉంటుంది

మధ్య తరగతి ఆలోచనల మహారాణి
మా యద్దనపూడి సులోచనారాణి
మీ నిష్క్రమణతో

నేల కొంత భారాన్ని కాదు
సారాన్ని కోల్పోయింది
గాలి కొంత శ్వాసని కాదు
పరిమళాన్ని కోల్పోయింది
'అక్షరం' రాసే చేయిని కాదు
చేయూతని కోల్పోయింది

నన్నెప్పుడు చదవమని తిట్టని
చదవలేదని కొట్టని
నా అధ్యాపకురాలికి
ఇదే నా 'అక్షర' నివాళి.

★★★

## సంభ్రమం
## కళ్యాణదుర్గం స్వర్ణలత

మనసుపొరలు మందమై అందరూ
తమచుట్టూ కందకాలను తవ్వుకొని
కోటల్ని నిర్మించుకుంటుంటే
రాలినాకులు రాత్రికురిసిన వానకు
తడిసి చప్పుడు చేయటానికి బద్ధకిస్తున్నాయి..

సరిగ్గా అప్పుడే ...

పొడచిన పొద్దుకు చీకటి పరుగెట్టినట్టు
నాలో మొలచిన నీ తలపుకు నిరాశ నిట్టూర్చింది

ప్రవాహంలా సాగే ఆలోచననంతా ఏకంచేస్తూ
నీపిలుపు నా ప్రతి పలుకులో మురిసింది

నీ దర్శనంలేని కంటికరువును
అశ్రువులు తీరుస్తుంటే
నిబ్బరంగ నీ రూపు చూపును తాకింది

చినుకు చినుకు ముడిపడి ప్రవాహమైనట్టు
నీ ప్రతి భావం అలవోకగా అక్షరమౌతోంది

మరొక్కమాట చెప్పనా..
నీవు సంబరానివి
సరిపోల్చలేని సంభ్రమానివి ...అంతే..

★★★

## లిప్ స్టిక్
## మార్టూరి శ్రీరామ్ ప్రసాద్

నువ్వు ఏమైనా అనుకో
బరితెగించాననుకో
ఏమైనా అనుకో -
పాతివ్రత్యం పేరుతో
నన్ను అణగదొక్కే క్రమంలో
సంప్రదాయపు ముసుగు చుట్టావు,
నిన్ను ఎదిరించి
నా పెదాలపై మెరిసే
ఎర్రని లిప్ స్టిక్
నే వ్రాసిన తిరుగుబాటు అనుకో !

పెత్తనం చెలాయించే దిశగా
నన్ను వంటింటి పాత్రను చేసావు
నీ విలాస వస్తువుగా మార్చావు
నీ కుటుంబ గౌరవంగా ఏమార్చావు,

నుదుటి కుంకుమ సాంప్రదాయమైతే
పెదాలపై లిప్ స్టిక్
నా ఆత్మవిశ్వాసపు చిహ్నం!
రెండింటి రంగూ ఎరుపే
నాలో మండే అగ్నిజ్వాలలా
రెండూ నాకవసరమే.!!

★★★

## రావేలా మాధవా!
### వాసుదేవమూర్తి శ్రీపతి

ఆకాశాలే ఒరిగెలే
ఎదన ఆశాదీపం కరిగెలే
కనులే నదులై ఎగసెలే
కనునదులే ఎదపై కురిసెలే
గడపై నీకై వేచినా..
గడిచే కాలాన్నే ఆపినా
రావేల మాధవా..
ఈ రాధనేలవా..
ఓ భ్రమరపు సవ్వడి వినబడి
నీ మురళీ రవమని భ్రమపడి
నా హృదయము తనువుతో విడివడి
ఈ వనమున లతలతో తలపడి
సుడి పవనపు వడితో పరుగిడి
ఏ కడ నీ అలికిడి కానక అలిసెనురా
ఓ గిరిని గోటితో ఎత్తుట
ఆ అసురుల శిరములు కూల్చుట
కడు ఘనమని సఖుడా గర్వము నీకేల
నువు రాధగా మారి
విరహాన్ని మోయరా
ఒక గడియ కూడా వేదన తాళలేవురా.

★★★



## ఆ చివర చీకట్లో
### యామినీ దేవి కోడే

ఒక మరచిపోని జ్ఞాపకం నన్ను తాకినప్పుడు
నువ్వు ఒక నిస్తేజపు చూపొకటి విసిరేస్తావ్!!
చిన్న ఆనందం నన్ను తడమగానే
నా లోకి నేచూడటం మరచి
నిన్ను నేను వెతక్కుంటూ ఉంటా!!
నాలోనే ఉన్న నువ్వు
చిద్విలాసంగా చూస్తూంటావ్..!!
నేను విందామనుకుంటూ ఉంటా
నువ్వు చెప్పాలనే అనుకోవు.
నేను చెప్పాలనే చూస్తా
నీకు వినే తీరికుండదు.
మనసు మాట్లాడుతూ ఉంటుంది
పెదవి విడివడదు!!
మనసు ముడి... వీడదు!!
మౌనాన్ని తొడుక్కున్న మనమిద్దరం
ఆ చివర వరకూ
రెండు పట్టాల మీదా పక్క పక్కనే
నడుస్తూ ఉంటాం.
కలవని సరళ రేఖలు రెండూ
అనంత ప్రయాణాన్ని అందిస్తాయ్!!
దేహపు కాంతి తగ్గి
పరిపక్వత పెరిగినట్టు
మెల్లగా
పగటి కాంతి తగ్గి
సంధ్య చీకట్లో
నా ఆశ ఆశయంగా
జ్ఞాన జ్యోతై వెలుగుతుంది.

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

కొమ్మ చివర పాడెడు కోకిలమ్మ పాట
చిలుకలును గోరువంకలు చేయు ధ్వనులు
కువకువలు వినిపించు బాతువుల రొదలు
వినగలిగి యర్థము తెలిసికొనగలేము

మనసు లోపలనున్న నా మాటలన్ని
వెలువరింతును వానికి ప్రేమ మీర
తెలియునో లేదొ యించుక తెలియలేను
ఒప్పుకొనునట్టులవి తల యూచుచుండు

ఎట్లు గడపెనో దినమెల్లనీ పికమ్ము
ఏ వనమ్ముల తిరిగెనో యీ శుకమ్ము
ఏమి వెతలను చెందెనో యీ విహంగ
మేమి యాశలు దాచెనో హృదయమందు

పంచుకొనలేవు మనతోడ బాధలేవి
పలుకనేరవు తమ యనుభవములేవి
ఎడద విప్పి యేమియు వినిపింపలేవు
విని తరించెడు భాగ్యమ్ము మనకు లేదు

సృష్టిలోనున్న బహుజంతుజీవతతులు
చెప్పుకొనెడు మాటలు మన చెవిని తాకు
అర్థమే కాదు దురదృష్టమన్ననిదియె
అర్థమైనచోనీ జన్మ సార్థకమ్ము



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS